




# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

గురువారం,
జనవరి 8, 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


## ట్రైబ్యునల్లో తేలాలి.. ప్రాజెక్టులు అప్పగించాలి

**బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ తీర్పు తర్వాతే టెలిమెట్రీల ఏర్పాట్లు**

**ప్రాజెక్టుల అప్పగింతపై న్యాయ వివాదాలు కొనసాగుతున్నాయని స్పష్టం**

**టెలిమెట్రీల ప్రతిపాదనకు తెలంగాణ అనుకూలం, ఏపీ వ్యతిరేకం**

**తెలంగాణ ఇచ్చిన రూ.4.18 కోట్లు బోర్డు నిర్వహణకే వినియోగం**

**రెండు రాష్ట్రాలు బడ్జెట్ విడుదల చేయాలని కృష్ణా బోర్డు ఆదేశం**

**ఈ నెలాఖరున కేఆర్‌ఎంబీ సర్వసభ్య సమావేశానికి యోచన**



హైదరాబాద్: కృష్ణా జలాల పంపిణీపై బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ (కేడబ్ల్యూడీటీ–2) విచారణ పూర్తయి నీటి కేటాయింపులు ఖరారై, ఉమ్మడి ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించిన తర్వాతే పరీవాహకంలో ప్రవాహాలను లెక్కించేందుకు టెలిమెట్రీ పరికరాల ఏర్పాటు సాధ్యమని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) స్పష్టం చేసింది. కీలకమైన ఈ అంశాలపై న్యాయ విచారణలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం ఎలాంటి నిర్ణయం తీసుకునే పరిస్థితి లేదని తెలిపింది. ఈ మేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వేర్వేరుగా లేఖలు పంపింది. గత ఏడాది జనవరిలో జరిగిన కేఆర్‌ఎంబీ 19వ సమావేశంలో టెలిమెట్రీల ఏర్పాటుకు కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బోర్డు నిర్వహణకు అవసరమైన నిధులను ఏపీ, తెలంగాణ రెండూ చెల్లించేందుకు అంగీకరించాయి. అయితే టెలిమెట్రీల ఏర్పాటుకు ఏపీ అభ్యంతరం తెలపడంతో, ఏపీ వాటాను కూడా కలిపి చెల్లిస్తామని

(మిగతా 2వ పేజీలో)



## రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు ఏప్రిల్ నుంచి

**రాజకీయాలకతీతంగా పేదలందరికీ ఇస్తాం**

**మోడల్ కాలనీ ఇళ్ల ప్రారంభంలో పొంగులేటి**

**నీటి హక్కులపై రాజీ ప్రసక్తే లేదు: ఉత్తమ్**

హుజూర్‌నగర్, జనవరి 7 : ఏప్రిల్ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, పేదలకు అందిస్తామని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా రూ.23 వేల కోట్లతో 23 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని చెప్పారు. రాజకీయాలకతీతంగా పేదలందరికీ ఇళ్లు ఇస్తామని పేర్కొన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని ఫణిగిరి గట్టు వద్ద నిర్మాణంలో ఉన్న మోడల్ కాలనీ ఇళ్లను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేవలం గులాబీ నేతలకు మాత్రమే ఇళ్లు ఇచ్చిందని ఆరోపించారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందన్నారు. పేదల కోసం ఇళ్లు కడితే

(మిగతా 2వ పేజీలో)

## ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు చేసింది సున్నా

**రైతులకు కనీసం యూరియా బస్తా కూడా ఇవ్వలేరు**

**వచ్చే ఎన్నికల్లో ఖమ్మంలో ఏడెనిమిది స్థానాలు గెలుస్తాం**

**మరింత ఐక్యంగా పనిచేస్తే పదికి పది గెలుచుకుంటం**

**రాహుల్‌కు 6 వేల కోట్లివ్వకుంటే రేవంత్ పోస్టు ఊస్ట్**

**గ్యారెంటీ కార్డు ఎక్కడ భద్రపర్చుకోవాలో భట్టి చెప్పాలి**

**ఖమ్మం సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



ఖమ్మం, జనవరి 7 : ఖమ్మం జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు 30% చొప్పున కమీషన్లు తీసుకుంటున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు తీవ్ర ఆరోపణలు చేశారు. 'బాంబులేటి'కి 30% టాక్స్ కట్టాల్సిందేనని, ఆయన దగ్గరికి ఏ భూ పంచాయితీ వెళ్లినా, దాని విలువలో 30% అడుగుతున్నారని విమర్శించారు. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా అదే పనిలో ఉన్నారని దుయ్యబట్టారు. జిల్లాలో ముగ్గురు మోసగాళ్లు ఉన్నారని, వీరికి అసలైన నాయకుడు అలీబాబా వీరిపైన ఉన్నారని విమర్శించారు. ముగ్గురు మంత్రుల్లో ఏ ఒకరూ జిల్లాకు పనికొచ్చే పనులు చేయడం లేదని, కనీసం రైతులకు యూరియా బస్తా కూడా ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో ద

(మిగతా 2వ పేజీలో)



## సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడికి సిట్ నోటీసులు

**కొండల్‌రెడ్డి ఫోనూ ట్యాప్!**

**నేడు కార్యాలయానికి వచ్చి వాంగ్మూలం ఇవ్వాలని పిలుపు**

**మరికొందరినీ విచారణకు పిలిచిన దర్యాప్తు అధికారి**

హైదరాబాద్: అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న సిట్ దూకుడు పెంచింది. ఈ వ్యవహారంలో బాధితులతో పాటు రాజకీయ నాయకులు, వారి సంబంధీకుల నుంచీ వాంగ్మూలాలు సేకరిస్తోంది. ఇందులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డికి కూడా బుధవారం నోటీసులు జారీ చేసింది. గురువారం ఉదయం 11కి సిట్ కార్యాలయానికి వచ్చి వాంగ్మూలం ఇవ్వాల్సిందిగా కోరింది. మరోపక్క బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, జైపాల్ యాదవ్‌లతో పాటు ప్రస్తుత ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుమారుడు సందీప్ రావు,

(మిగతా 2వ పేజీలో)

## మున్సిపల్ ఎన్నికల వేడి

**పట్టణాల్లో రాజకీయ కదలికలు వేగం**

**12న తుది ఓటర్ల జాబితా విడుదల**

**రిజర్వేషన్ల ఖరారుపై అధికారుల కసరత్తు**

**117 మున్సిపాల్టీలు, 6 కార్పొరేషన్లకు సిద్ధం**

**ఫిబ్రవరిలో పోలింగ్ జరిగే సూచనలు**

**రాష్ట్ర ఎన్నికల సంఘం పర్యవేక్షణ**

**నోటిఫికేషన్‌కు రంగం సిద్ధం**



హైదరాబాద్: తెలంగాణలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం వేడెక్కుతోంది. రాష్ట్రవ్యాప్తంగా గడువు ముగిసిన మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించేందుకు పురపాలక శాఖతో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లను ముమ్మరం చేశాయి. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం వేగం పెంచింది. ఇప్పటికే ఓటర్ల జాబితాల తయారీ కీలక దశకు చేరుకుంది. రాష్ట్రంలో గడువు ముగిసిన 117 మున్సిపాల్టీలు, 6 కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మరోవైపు ఇంకా గడువు ముగియని నాలుగు మున్సిపాల్టీలు, జీహెచ్‌ఎంసీని ఈ ఎన్నికల నుంచి మినహాయించారు. బాహ్య వలయ రహదారి పరిధిలోని మున్సిపాల్టీల విలీనంతో జీహెచ్‌ఎంసీ పరిధి పెరగడం, నగరాన్ని మూడు భాగాలుగా విభజించాలన్న ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉండటంతో అక్కడ ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈ నెల ఒకటిన ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసిన అధికారులు ప్రస్తుతం అభ్యంతరాల పరిశీలనలో నిమగ్నమయ్యారు. అన్ని అభ్యంతరాలపై నిర్ణయం తీసుకున్న తర్వాత ఈ నెల 12న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఆ తరువాత ఎన్నికల నోటిఫికేషన్‌ను ఈ నెల 20న విడుదల చేసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎన్నికలు ఫిబ్రవరి రెండో వారంలో జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. రిజర్వేషన్ల ఖరారు మొత్తం ఎన్నికల

(మిగతా 2వ పేజీలో)

# సంస్థాన్ నారాయణపురం క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్ 5 ప్రారంభించిన ఎస్ఐ జగన్

## క్రీడల ప్రారంభానికి వచ్చిన అతిథులను సన్మానించిన టోర్నమెంట్ నిర్వాహకులు





యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో గత 5 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నటువంటి సంస్థాన్ నారాయణపురం క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్-5 ను టోర్నమెంట్ స్పాన్సర్ లు నారాయణపురం సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి - లింగస్వామి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ముద్దంగుల నరసింహ,మాజీ సర్పంచ్ దోనూరు జైపాల్ రెడ్డి, స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్ గారితో కలిసి ప్రారంభించిన నారాయణపురం ఎస్ఐ జగన్ ఈ యొక్క కార్యక్రమంలో నారాయణపురం మాజీ ఎంపీపీ గుత్తా ఉమా ప్రేమ్చందర్ రెడ్డి, నారాయణపురం మాజీ సర్పంచ్ కోన్ రెడ్డి నరసింహ, మరియు వివిధ గ్రామాల సర్పంచులు,మాజీ ఎంపీటీసీ లు ప్రస్తుత వార్డు నెంబర్లు తదితరులు పాల్గొన్నారు అనంతరం టోర్నమెంట్ ఎస్ఎన్ పిఎల్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పల నాగరాజు,ఎస్ ఎన్ పి ఎల్ సీజన్ 5 అధ్యక్షులు కొండ నవీన్ గౌడ్,మరియు సభ్యులంతా కలిసి స్పాన్సర్లను మరియు ప్రారంభానికి వచ్చిన ముఖ్య అతిథులను శాలువా కప్పి సత్కరించారు.ఈ కార్యక్రమంలో క్రీడాకారులు,గ్రామ ప్రజలు,మాజీ ప్రజా ప్రతినిధులు,అభిమానులు తదితరులుపాల్గొన్నారు.



యువత క్రీడలపై ఆసక్తిపెంచుకో వాలని నారాయణపూర్ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మ- లింగస్వామి అన్నారు సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రంలో క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్ 5 లీగ్‌టోర్నమెంటును ప్రారంభించి మాట్లాడారు. నేటి యువత చెడు అలవాట్లకు లోనుకాకుండా క్రీడలపై దృష్టి సారించాలన్నారు. క్రీడలతోమానసికోల్లాసంతోపాటు దేహదారుఢ్యం మెరుగుపడుతుందన్నరు. క్రీడల్లో మంచి నైపుణ్యం సాధించే క్రీడాకోట కింద ఉద్యోగ అవకాశాలు సైతం ఉం టాయన్నారు. క్రీడల్లో క్రీడాకారులు అందరూ కీడ్రాస్ఫూర్తి ప్రదర్శించాలని పేర్కొన్నారు.

**- నారాయణపూర్ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మ- లింగస్వామి**



క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ప్రతి ఒక్కరూ క్రీడలలో పాల్గొని ఆరోగ్యంగా జీవించాలని, క్రీడలకు ఎక్కువ టీములు రావడం సంతోషంగా ఉందన్నారు. క్రీడలు జరిగినన్ని రోజులు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. యువత విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించి జిల్లాకు, రాష్ట్రానికి, మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రతి ఓటమి మరో గెలుపునకు నాంది పలుకుతుందని చెప్పారు. ఈ పోటీలలో ఓడినవారు నిరుత్సాహం చెందకుండా రాబోయే ఆటలలో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం విద్య, ఉద్యోగాలలో మొదటి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. **- ఎస్ ఎన్ పి ఎల్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పల నాగరాజు**

క్రీడలతోనే శారీరకంగా మానసికంగా ఉల్లాసం కలుగుతుందని స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్ అన్నారు. సంస్థాన్ నారాయణపూర్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్ 5 ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ప్రతీఒక్కరు క్రీడల్లో పాల్గొనాలన్నారు. తద్వారా శారీరకంగా దృఢంగా ఉండటానికి దోహదపడుతుందన్నారు యువతకు క్రీడలు ప్రోత్సాహం అందిస్తుందని ఈ సందర్భంగా తెలిపారు

**- స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్**



# ట్రైబ్యునల్లో తేలాలి.. ప్రాజెక్టులు అప్పగించాలి

తెలంగాణ ముందుకొచ్చి రూ.4.18 కోట్లను విడుదల చేసింది. టెలిమెట్రీల ఏర్పాటుపై తాజాగా కేంద్ర జలశక్తి శాఖను సంప్రదించిన బోర్డు, కేంద్రం సూచనల మేరకు రాష్ట్రాలకు లేఖలు రాసింది. శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ఉమ్మడి ప్రాజెక్టుల కింద జల వినియోగాన్ని పర్యవేక్షంచడమే బోర్డు ప్రధాన బాధ్యత అని పేర్కొంది. ట్రైబ్యునల్ కేటాయింపులకు లోబడి జలాశయాల నుంచి నీటి విడుదల, వినియోగాన్ని నమోదు చేస్తామని వివరించింది. 2021లో కేంద్రం విడుదల చేసిన గెజిట్ ప్రకారం ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించాల్సి ఉన్నప్పటికీ, దీనిపై సుప్రీంకోర్టులో వ్యాజ్యం కొనసాగుతోందని స్పష్టం చేసింది. న్యాయ వివాదాలు, ఏపీ వ్యతిరేకత కారణంగా టెలిమెట్రీ పరికరాల ఏర్పాటు ప్రస్తుతం సాధ్యపడదని తెలిపింది. టెలిమెట్రీల ఏర్పాటుకు తెలంగాణ కేటాయించిన రూ.4.18 కోట్లను బోర్డు నిర్వహణ అవసరాలకు వినియోగిస్తామని కేఆర్ఎంబీ వెల్లడించింది. 2024ఉ25, 2025ఉ26 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి రెండు రాష్ట్రాలు రూ.23.31 కోట్ల చొప్పున చెల్లించాల్సి ఉందని, వెంటనే బడ్జెట్‌ను విడుదల చేయాలని కోరింది. మొదటి దశలో రెండు రాష్ట్రాల్లో 18 చోట్ల టెలిమెట్రీ పరికరాలు ఏర్పాటు కాగా, రెండో దశలో తొమ్మిది చోట్ల ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందులో శ్రీశైలం కుడి ప్రధాన కాలువ (పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ), నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువలు, పాలేరు జలాశయం ఎగువ ప్రాంతాలు, పోలవరం కాలువ, ప్రకాశం బ్యారేజీ తూర్పు, పశ్చిమ కాలువలు, కడపఉకర్నూల్ కాలువలు ఉన్నాయి. కేఆర్ఎంబీ సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు ఎజెండా జాబితాను పంపాలని రెండు రాష్ట్రాలను బోర్డు తాజాగా గుర్తు చేసింది. గతేడాది డిసెంబరు చివరినాటికి ఎజెండా పంపాలని సూచించినా స్పందన లేకపోవడంతో మరోసారి లేఖలు రాసింది. ఈ నెలాఖరున సమావేశం నిర్వహించే యోచనలో ఉన్నట్లు సమాచారం. టెలిమెట్రీల కోసం తెలంగాణ విడుదల చేసిన నిధులను బోర్డు నిర్వహణకు మళ్లించడంపై తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. కృష్ణా పరీవాహకంలో ఏపీ అధికంగా నీటిని వినియోగించడాన్ని ఖచ్చితంగా లెక్కించేందుకే సీఎం



రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.4.18 కోట్లు కేటాయించారని నీటిపారుదల శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ అంశంపై ఈఎన్సీ అంజద్ హుస్సేన్ ప్రభుత్వానికి లేఖ రాయగా, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వివరాలు అందించారు. టెలిమెట్రీల కోసం కేటాయించిన నిధులను వేరే అవసరాలకు వినియోగించడం సమంజసం కాదని, నిర్వహణ, టెలిమెట్రీల ఖర్చులను వేర్వేరుగా పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసినట్లు తెలిసింది.



# కేపీహెచ్‌బీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భారీ చోరీ

### సర్దార్ పటేల్ నగర్‌లో ఉన్న ఆలయంలో చోరీ

### అర్ధరాత్రి ఆలయంలోకి ప్రవేశించిన దొంగలు

### రూ. 50 లక్షల విలువైన వెండి ఆభరణాల చోరీ

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో మరోసారి ఆలయ చోరీ ఘటనతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని సర్దార్ పటేల్ నగర్‌లో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో దొంగలు భారీ చోరీకి పాల్పడ్డారు. అర్ధరాత్రి వేళలో దుండగులు గుడి లోపలికి చొరబడి, గర్భగుడి తాళాలను పగులగొట్టి స్వామివారి వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లిపోయారు. ఈ నగల విలువ సుమారు 50 లక్షల రూపాయలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ దారుణ ఘటన ఉదయం గుడి తెరిచిన తర్వాతే బయటపడింది. గుడి సిబ్బంది, స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు తక్షణమే ఆలయానికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దొంగలు ఎలా లోపలికి వచ్చారు, ఏ మార్గంలో పారిపోయారు అనే అంశాలపై క్లూస్ సేకరిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజ్‌ను సేకరించి, డాగ్ స్క్వాడ్‌ను కూడా రంగంలోకి దింపారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు మొదలుపెట్టారు. దొంగలు ఎవరు, ఎక్కడి నుంచి వచ్చారు అనే విషయాలను త్వరలోనే కనిపెడతామని తెలిపారు. హైదరాబాద్‌లో ఇటీవల కాలంలో ఆలయాల్లో చోరీలు పెరిగిపోతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయాల చుట్టూ మెరుగైన భద్రత, సీసీ కెమెరాలు, రాత్రి వేళలో గస్తీని పెంచాలని కోరుతున్నారు.

# తెలంగాణలో 20మంది ఐపీఎస్‌ల బదిలీ

### 4 కమిషనరేట్లలో జోన్ల పునర్వ్యవస్థీకరణ

### డీసీపీ స్థాయిలో కీలక నియామకాలు

### ఫ్యూచర్ సిటీపై ప్రత్యేక దృష్టి.. పట్టణ భద్రతకు కొత్త వ్యూహం

### సీఎస్ ఉత్తర్వులతో అమల్లోకి మార్పులు

రాష్ట్ర పోలీసు వ్యవస్థలో విస్తృత స్థాయి మార్పులు చోటుచేసుకున్నాయి. తెలంగాణవ్యాప్తంగా మొత్తం 20 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా ఏర్పాటైన జోన్లు, పెరుగుతున్న పట్టణ విస్తరణ, శాంతిభద్రతల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నాలుగు పోలీస్ కమిషనరేట్లలో డీసీపీ స్థాయిలో కొత్త నియామకాలు చేపట్టింది. ఈ మేరకు ప్రధాన కార్యదర్శి అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ నగరం సహా పరిసర ప్రాంతాల్లో పోలీసింగ్‌ను మరింత సమర్థంగా నిర్వహించాలనే లక్ష్యంతో ఈ మార్పులు చేసినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. దక్షిణ రేంజ్‌లో అదనపు కమిషనర్‌గా తఫ్సీర్ ఇక్బాల్‌కు బాధ్యతలు అప్పగించగా, ఉత్తర రేంజ్ జాయింట్ కమిషనర్‌గా శ్వేతను నియమించారు. స్పెషల్ బ్రాంచ్ విభాగంలో జాయింట్ సీపీగా విజయ్‌కుమార్‌కు బాధ్యతలు కేటాయించారు. నగరంలోని కీలక ప్రాంతాల్లో డీసీపీ స్థాయిలో పునర్వ్యవస్థీకరణ జరిగింది. కూకట్‌పల్లి డీసీపీగా రితిరాజ్‌ను నియమించగా, చేవెళ్ల బాధ్యతలను యోగేశ్ గౌతమ్‌కు అప్పగించారు. ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని మహేశ్వరం జోన్‌కు కె. నారాయణ రెడ్డిని నియమించారు. ఎల్బీనగర్ డీసీపీగా అనురాధ, ఉప్పల్ జోన్‌కు సురేశ్‌కుమార్‌ను కేటాయించారు. సికింద్రాబాద్ జోన్‌లో కె. రక్షిత, కుత్బుల్లాపూర్‌లో ఎన్. కోటిరెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు. చార్మినార్ జోన్ డీసీపీగా కిరణ్ ప్రభాకర్‌ను నియమించగా, శేరిలింగంపల్లికి సీహెచ్ శ్రీనివాస్‌ను కేటాయించారు. మల్కాజిగిరి జోన్‌కు శ్రీధర్, ఖైరతాబాద్ జోన్‌కు శిల్పవల్లి బాధ్యతలు అప్పగించారు. రాజేంద్రనగర్ డీసీపీగా శ్రీనివాస్, గోల్కొండ జోన్‌కు చంద్ర మోహన్, జూబ్లీ హిల్స్ జోన్‌కు రమణారెడ్డిని ప్రభుత్వం నియమించింది. శంషాబాద్ జోన్‌లో రాజేశ్, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్‌లోని షాద్‌నగర్ ప్రాంతానికి శిరీష్‌ను డీసీపీగా కేటాయించారు. ఇదే సమయంలో సిద్దిపేట పోలీస్ కమిషనర్‌గా సాధనా రష్మీ పెరుమాళ్‌కు బాధ్యతలు అప్పగించారు. పట్టణ విస్తరణ, జనాభా పెరుగుదల, ట్రాఫిక్ నియంత్రణతో పాటు నేరాల నివారణలో మరింత పటిష్టమైన చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో ఈ బదిలీలు జరిగాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. కొత్త అధికారుల నియామకంతో పోలీసు వ్యవస్థ మరింత చురుగ్గా పనిచేస్తుందని, శాంతిభద్రతల పరిరక్షణలో స్పష్టమైన మార్పు కనిపిస్తుందని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడికి సిట్ నోటీసులు

ఎమ్మెల్సీ నవీన్‌రావు తండ్రి కొండల్‌రావు తదితరులనూ నోటీసులు ఇచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ 16న సుప్రీంకోర్టులో విచారణకు రానుంది. ఆ రోజు నివేదిక సమర్పించాల్సి ఉండటంతో సిట్ వేగం పెంచింది. ప్రభాకర్‌రావు 2023 ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబీకులు, సంబంధీకులు, అనుచరులపై నిఘా ఉంచారని, దీనికోసం ప్రత్యేకంగా 'ఆర్ఆర్ మాడ్యూల్'పేరుతో ఓ వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. అప్పట్లో ఎస్ఐబీలోని స్పెషల్ ఆపరేషన్ టీమ్‌కు (ఎస్వోటీ) నేతృత్వం వహించిన డీఎస్పీ డి.ప్రణీత్‌రావు దీన్ని పర్యవేక్షంచారు. ప్రభాకర్‌రావు హయాంలో ఎస్ఐబీ కేంద్రంగా అనేక మంది ఫోన్లు ట్యాప్ అయ్యాయని, వీరిలో సినీ, రాజకీయ ప్రముఖులతో పాటు వ్యాపారవేత్తలు, బిల్డర్లు, రియల్టర్లు కూడా ఉన్నారని సిట్ చెబుతోంది. ఈ క్రమంలోనే వారికి వచ్చే ఫోన్ కాల్స్, ఎస్సెమ్మెస్ తదితరాలను పర్యవేక్షంచడానికి కొందరు ఎస్ఐబీ అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. ఇందులో భాగంగానే రేవంత్‌రెడ్డితో పాటు ఆయన సోదరుడు కొండల్‌రెడ్డి సహా మరికొందరు నంబర్లు కలిపి ఏర్పాటు చేసిన మాడ్యూల్‌కు ప్రభాకర్‌రావు 'ఆర్ఆర్ మాడ్యుల్'అనే పేరు పెట్టినట్లు తెలుస్తోంది. ఈ విధంగా ఏర్పాటు చేసిన మాడ్యూళ్లలో ఉన్న వారి ఫోన్లను సర్వకాల సర్వావస్థల్లోనూ పర్యవేక్షస్తూ ఉండటానికి డీఎస్పీ ప్రణీత్‌రావు నేతృత్వంలో 20 మంది సిబ్బందిని నియమించారు. వీరిలో కొందరు అత్యాధునిక ఉపకరణాలతో రేవంత్‌రెడ్డి, కొండల్‌రెడ్డి ఇళ్ల సమీపంలో తాత్కాలిక వార్‌రూమ్స్ ఏర్పాటు చేసుకుని పర్యవేక్షంచినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే కొండల్‌రెడ్డికి సిట్ నోటీసులు జారీ చేసింది.

# మున్సిపల్ ఎన్నికల వేడి

ప్రక్రియలో కీలకంగా మారింది. 2011 జనాభా లెక్కలను ఆధారంగా చేసుకుని ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు నిర్ణయించనున్నారు. అదే సమయంలో రాష్ట్రంలో కులగణన కోసం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ సిఫారసుల ప్రకారం బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ జనాభా తక్కువగా ఉండటంతో వారి వాటాను జనాభా ప్రాతిపదికన లెక్కించి స్థానాలను కేటాయించనున్నారు. గత పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో నమోదైన జనాభా శాతాలనే ఈసారి కూడా ప్రామాణికంగా తీసుకుంటారని అధికారులు చెబుతున్నారు. అప్పట్లో ఎస్సీలకు 13.82 శాతం, ఎస్టీలకు 3.25 శాతం, బీసీలకు 32.52 శాతం రిజర్వేషన్లు ఖరారు చేశారు. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పరిమితిలో ఉండేలా బీసీలకు స్థానాలు కేటాయించనున్నారు. ఏ సామాజిక వర్గానికి రిజర్వ్ చేసినా అందులో సగం స్థానాలు మహిళలకే దక్కనున్నాయి. మొత్తంగా అన్ని మున్సిపల్ స్థానాల్లో 50 శాతం మహిళా రిజర్వేషన్ అమలవుతుంది. ఎన్నికల ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రత్యేక దృష్టి సారించింది. ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 12న తుది ఓటర్ల జాబితాను, 13న పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను విడుదల చేసి టి-పోల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ల వివరాలు, ఫొటోతో కూడిన తుది ఓటర్ల జాబితాను 16న వార్డు వారీగా ప్రచురించాలని కమిషన్ స్పష్టం చేసింది. అలాగే బ్యాలెట్ బాక్సుల అవసరం, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్, జోనల్ అధికారుల నియామకాల వివరాలను సకాలంలో టి-పోల్‌లో నమోదు చేయాలని ఆదేశించింది. పట్టణాల్లో రాజకీయ సమీకరణలు మారుతున్న వేళ మున్సిపల్ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారనున్నాయి.

### రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు

# ఏప్రిల్ నుంచి

కమీషన్లు రావనే ఆలోచనతోనే మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టించి కమీషన్లు కొట్టేశారని ఆయన ఆరోపించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కృష్ణా-గోదావరి జలాల నీటి హక్కులపై రాజీ పడే ప్రసక్తే లేదని అన్నారు. తెలంగాణ వాటా నీటి హక్కులపై కృష్ణా ట్రైబ్యునల్ ఎదుట సమర్థంగా వాదనలు వినిపించామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి కృష్ణా, గోదావరి జల్లాలో తెలంగాణకు రావాల్సిన నీటి కేటాయింపులపై చర్చించామని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రి హరీశ్ రావు, కేటీఆర్‌లు కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారన్నారు. తెలంగాణ సమాజాన్ని పక్కదారి పట్టించేందుకు బీఆర్ఎస్ నాయకులు కుట్రలు చేస్తున్నారన్నారు. అసెంబ్లీలో, బయట మాజీ మంత్రులు అబద్ధాలు చెబుతున్నారని, బీఆర్ఎస్ నాయకులే గత ప్రభుత్వ హయాంలో ఏపీతో అక్రమ ఒప్పందాలు చేసుకున్నారని ఆయన అన్నారు.

# సర్పంచ్ భూక్య సంతోష్ నాయక్ ను సన్మానించిన ఎమ్మెల్యే మందల సామేల్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తుంగతుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మందుల సామెల్ జేతురం తండా సర్పంచ్ బుక్య సంతోష్ నాయక్ ని అభినందించి, సన్మానించడం జరిగింది, అన్ని వర్గాల ప్రజల కోసం తమ్ముడు ఎప్పుడు ముందే ఉంటాడు తమ్ముడు అంతకుముదు లంబాడి హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా తెలంగాణ ఉద్యమం నుంచి తమ్మొడు పనిచేస్తున్నాడు సబండ వర్గ ప్రజల సమస్యలపై నిత్యం పోరాటం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే యువ నాయకుడు సర్పంచ్ గా గెలవడం శుభ పరిణామం నేటి యువతకి తమ్ముడు సంతోష్ నాయక్ ఆదర్శం ఇంక నిలవాలని కొనియాడారు, ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు



## తుక్కాపురం గ్రామంలో నర్సరీ ప్రారంభించిన సర్పంచ్ జనగాం పాండు

## నర్సరీ తో జీవవైవిద్యాన్ని పెంచడం పర్యావరణ ప్రయోజనాలు

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

భువనగిరి మండలం తుక్కాపురం గ్రామంలో 2025-26 ఆర్థిక సం// రానికి సంబందించిన నర్సరీ పనులను గ్రామ నూతన సర్పంచ్ జనగాం పాండు ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెట్లు, మొక్కలను పెంచడం ద్వారా గాలిని శుద్ధి చేయడం, నేల కోతను నివారించడం, మరియు జీవవైవిద్యాన్ని పెంచడం వంటి పర్యావరణ ప్రయోజనాలు ఉంటాయని అన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాసాల లింగస్వామి, కార్యదర్శి లోకేష్, ఏపీఓ బాలస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ వేణు కుమార్ మరియు వార్డ్ సభ్యులు జనగాం ఇందిరమ్మ ,జనగాం మహేష్, రత్నాపురం శ్రీకాంత్, రాసాల శరత్ యాదవ్ ,వల్లపు సతీష్ యాదవ్, ముంత కృష్ణవేణి,దొమ్మటి భాగ్యలక్ష్మ, ఎల్లకొండ అలివేలు మరియు జైపాల్ రెడ్డి, పద్మారెడ్డి,రాసాల రాజు యాదవ్, ఎల్లకొండ సుధాకర్ రెడ్డి, రత్నపురం పురుషోత్తం, మర్రి నరేందర్ రెడ్డి, రాసాల క్రాంతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు



## రంగవల్లులు మహిళల్లో దాగిఉన్న సృజనాత్మకత ను వెలికి తీస్తాయి..

## గణేష్ ముదిరాజ్...

మియాపూర్ వార్త మిర్రర్ : రంగవల్లులు మహిళల్లో దాగిఉన్న సృజనాత్మకత ను వెలికి తీస్తాయనీ మియాపూర్ డివిజన్ బీజేపీ సీనియర్ నాయకులు గుండె గణేష్ ముదిరాజ్ అన్నారు.మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలే పండుగలనీ, సంక్రాంతి పర్వదినాన్ని పురస్కారించుకొని ముక్త డివిజన్ లోని లక్ష్మ వెంకట నగర్ లో గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మహిళలకు రంగువల్లుల పోటీలు నిర్వహించి అందులో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ మరియు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. సంస్కృతి, సంప్రదాయాలు నానాటికి కనుమరుగవుతున్నాయనీ,నేటి యువతరంకూడా మన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగించేందుకై ఈ పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.. ఈ పోటీలలో ప్రథమ బహుమతి శిరీష, ద్వితీయ సత్యదేవి, తృతీయ బహుమతి ప్రసన్న లు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## బీసీ సబ్ ప్లాన్‌ను తక్షణమే అమలు చేయాలి...

# రంగారెడ్డి జిల్లా టీఆర్ పీ వినతి పత్రం...

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : బీసీ సబ్ ప్లాన్‌ను తక్షణమే అమలు చేయాలి అనే డిమాండ్‌తో తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీ ఆర్ పీ )రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బండారి రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం రంగారెడ్డి జిల్లాలో సంబంధిత అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు.తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు చట్టబద్ధంగా రావాల్సిన సంక్షమ నిధులు, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని పేర్కొంటూ,బీసీ సబ్ ప్లాన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ టీ ఆర్ పీ రంగారెడ్డి జిల్లా నాయకులు ఎమ్మార్వో, ఆర్డీవో మరియు కలెక్టర్ కార్యాలయానికి వినతి పత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ....బీసీల హక్కుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.బీసీలకు న్యాయం జరిగే వరకు టీ ఆర్ పీ పార్టీ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు ఎంఎల్సీ తీన్మార్ మల్లన్న, ఉమ్మడి రంగారెడ్డి జిల్ల ఇంచార్జి మరియు వర్కింగ్ ప్రెసిడెంట్ సుదగాని హరి శంకర్ గౌడ్ ఆదేశాల మేరకు, పార్టీ సెంట్రల్ కమిటీ పిలుపు ప్రకారం నిర్వహించబడిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింగ్ ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు శంకరుల సురేష్ ముదిరాజ్, జిల్లా మహిళా అధ్యక్షరాలు బండారు విజయలక్ష్మ, మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ గుల్ల వాసుకి, లలితా రాణి, వనం పద్మ, యాదమ్మ, పొనుగోటి సందీప్, తదితరులు పాల్గొన్నారు .

# మాడ్గుల గ్రామ అభివృద్ధికి సహకారం

**- రూ “1,50,000 లతో ఐమాక్స్ లైట్స్ ఏర్పాటు**

**- ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ - రాఘవేందర్ రెడ్డి**




కల్వకుర్తి జనవరి 7 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి నియోజకవర్గ మాడ్గుల గ్రామపంచాయతీఅభివృద్ధిలో బాగంగా గ్రామ పంచాయతీ పాలకవర్గం కోరిక మేరకు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాడ్గుల పంచాయతీలో ఐమాక్స్ లైట్స్ ఏర్పాటు చేయుటకు రూ. 1,50,000 ల చెక్కును గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ లతో పాటు పాలకవర్గం సబ్యులకు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు జైపాల్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముదేంటి రజిత దేవయ్య గౌడ్ మరియు ఉప సర్పంచ్ సూదిని శరత్ రెడ్డి మాట్లాడుతూ..సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి గారిని గ్రామ పంచాయతీ అభివృద్ధికి అడిగిన వెంటనే స్పందించి ఎల్ఈడి లైట్స్ ఏర్పాటుకు ఒక లక్ష యాబై వేల రూపాయలు విరాళం అందజేసిన సందర్భంగా వారికి మాడుగుల గ్రామ పంచాయతీ పాలక వర్గం తరుపున మరియు ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలోమాడుగుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కిషన్ రెడ్డి గారు,మాడ్గుల మాజీ సర్పంచ్ శ్రీ సూదిని కొండల్ రెడ్డి,మాజీ సర్పంచ్ శ్రీ కాట్ల యాదయ్య గౌడ్,మాజీ ఎంపీపీ శ్రీ అన్నేపాక జంగయ్య,మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీ పల్లె జంగయ్య గౌడ్,సీనియర్ నాయకు శ్రీ సూదిని కోదండ వెంకట్ రెడ్డి,వార్డ్ మెంబర్లు మిద్దె రాములు, పర్వతాలు, పులికంటి సైదులుమరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలకు తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం పెద్ద పీఠ: అనిల్ కుమార్ యాదవ్.....

గచ్చిబౌలి వార్త మిర్రర్ : జాతీయ 26 వ స్కయ్ ఎస్ క్యూ ఏ వై ఛాంపియన్స్ గచ్చిబౌలి లోని బాలయోగి క్రీడా స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభం అయినవి. తెలంగాణ ఎస్ క్యూ ఏ వై అసోసియేషన్ వారు ఏజీఎస్ ఆఫ్ స్కయ్ ఎస్ క్యూ ఏ వై ఫెడ్రేషన్ ఆఫ్ ఇండియా తో కలిసి ఏర్పాటు చేసిన క్రీడా పోటీల్లో బాల బాలికలు వివిధ రాష్ట్రాల నుంచి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శేరిలింగంపల్లి నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్ విచ్చిసి విజేతలకు బహుమతులు అందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీఠ వేసి అవసరమైన ప్రతి అంశంలో కూడా అండగా ఉంటూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమలో టీపీసీసీ కార్యదర్శి సామల్ కార్తిక్, యువజన నాయకులు మహేందర్, మహేష్, వినోద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# బాలాపూర్ జెడ్.పి.హెచ్.ఎస్. టాయిలెట్ల నిర్మాణ పనులపై విచారణ చేపట్టండి.

## రాళ్లగూడెం రామకృష్ణ రెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 05 : మహేశ్వరం నియోజకవర్గం లో ఇటీవల చేపట్టిన బాలాపూర్ జెడ్.పి.హెచ్.ఎస్. టాయిలెట్ల నిర్మాణంలో గమనించిన లోపాలను గుర్తించిన సంబంధిత పనులు చేపట్టిన వారిపై పారదర్శక విచారణ చేపట్టాలని, వినియోగానికి వీలుకాని అత్యంత దుర్గంధం మరియు మౌలిక వసతులు లేని టాయిలెట్ల తో ఆ పాఠశాల విద్యార్థినులు పడుతున్న అవస్థలను దృష్టిలో పెట్టుకొని క్షత్ర స్థాయిలో పర్యటించి నాసిరకం పనులు చేసిన వారిపై తగిన చర్యలు తీసుకొనవలసినదిగా బడంగ్ పేట్ సర్కిల్ క్లస్టర్ - 1 బి.జె.పి. అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణ రెడ్డి జి.హెచ్.ఎం.సి శంషాబాద్ జోనల్ కమీషనర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. తక్షణమే స్పందించిన జోనల్ కమీషనర్, బడంగ్ పేట్ సర్కిల్ డెప్యూటీ కమీషనర్ త్రిల్లేశ్వర రావును సదరు పాఠశాలను సందర్శించి, పూర్తి వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని ఆదేశించారు. నివేదిక అందిన వెంటనే స్పందిస్తామని, అందులోని సారాంశాన్ని తెలియచేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ జనరల్ సెక్రెటరీ కొంతం మురళీధర్ రెడ్డి క్యారాగారి అరవింద్ జి. మల్లేష్ సి. అంజనేయులు తదితరులు పాల్గొన్నారు



# అమెరికాలో హత్యకు గురైన నికిత మృతు రాలి కుటుంబాన్ని పరామర్శించిన ఈస్ట్ జోన్ పోలీసులు

సికింద్రాబాద, వార్త మిర్రర్ జనవరి 7.... అగ్రరాజ్యం అమెరికాలో ఇటీవల హత్యకు గురైన నికిత మృతి ఘటనపై ఈస్ట్ జోన్ పోలీసులు స్పందించారు. తార్నాక విజయపురి కాలనీ లో ఉండే వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ నరసయ్య, ఏసీపీ శశాంక్ రెడ్డి, ఇన్స్పెక్టర్ రఘు బాబు తదితరులు నికిత తల్లి,తండ్రి ఆనంద్ వారి నివాసంలో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా నికిత మృతి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు.నికిత అమెరికాకు వెళ్లిన పరిస్థితులు, అక్కడ ఎదురైన పరిణామాలు, ఘటనకు ముందు జరిగిన అంశాలపై సమగ్రంగా ఆరా తీశారు. బాధిత కుటుంబం ఎదుర్కొంటున్న మానసిక వేదనను పోలీసు అధికారులు అర్థం చేసుకొని వారికి ధైర్యం చెప్పారు.ఈ కష్ట సమయంలో హైదరాబాద్ పోలీసులు పూర్తిస్థాయిలో అండగా ఉంటారని, కుటుంబానికి ఎలాంటి సహాయం అవసరమైనా అందిస్తామని డీసీపీ బాలస్వామి భరోసా ఇచ్చారు. నికిత కుటుంబానికి న్యాయం జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం కల్పించడమే లక్ష్యంగా హైదరాబాద్ పోలీసులు అన్ని కోణాల్లో సహకరిస్తారని, చట్టపరంగా చేయాల్సిన ప్రతి చర్యను పూర్తి చేస్తామని అడిషనల్ డీసీపీ నరసయ్య స్పష్టం చేశారు.



# “బీసీ సబ్ ప్లాను అమలు చేయాలని తెలంగాణ బీసీ విద్యార్థి యువజన సంఘం డిమాండ్

**రాష్ట్ర బడ్జెట్లో బీసీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా నిధులను కేటాయించాలి- గుండ గోని మధు గౌడ్**

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ తరహాలోనే వెనుకబడిన తరగతుల సమగ్ర అభివృద్ధి కోసం చట్టబద్ధమైన “బీసీ సబ్ ప్లాను అమలు చేయాలని తెలంగాణ బిసి విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండగోని మధు గౌడ్ తెలిపారుతెలంగాణ రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న వెనుకబడిన తరగతుల సామాజిక, ఆర్థిక స్థితిగతులు మెరుగుపడాలంటే వారికి ప్రత్యేక బడ్జెట్ మరియు చట్టపరమైన రక్షణ అవసరమని, ఎస్సీ, ఎస్టీలకు అమలవుతున్న సబ్ ప్లాన్ తరహాలోనే, బీసీల కోసం కూడా ప్రత్యేక సబ్ ప్లాను తక్షణమే ఏర్పాటు చేయాలని తెలంగాణ ఏర్పడ్డ నాటి నుండి ఇప్పటి వరకు బీసీల కోసం బడ్జెట్స్ కేటాయించి ఖర్చు చేయకుండా ఈ ప్రభుత్వాలు మిగుల్చుకున్నాయి. రాష్ట్ర బడ్జెట్లో బీసీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. కేటాయించిన నిధులు పక్కదారి పట్టకుండా, ఆర్థిక సంవత్సరం ముగిసినా ఆ నిధులు బీసీల కోసమే వినియోగించేలా సబ్ ప్లాను చట్టబద్ధత కల్పించాలన్నారు. బీసీ విద్యార్థుల కోసం ప్రతి మండలంలో బహుజన గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విదేశీ విద్యానిధి పథకాన్ని మరింత సరళతరం చేయాలన్నారు. నిరుద్యోగ బీసీ యువతకు మరియు కుల వృత్తుల వారికి ఎటువంటి షరతులు లేకుండా సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై ప్రభుత్వం చేసిన సమగ్ర కుల గణన నివేదికను బయటపెట్టాలనిఅన్నారుతెలంగాణ బీసీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండగోని మధు గౌడ్ డిమాండ్ చేశారు



# మాదకద్రవ్యాల వాడకాన్ని నివారించాలి: ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. కాసిం

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జనవరి 7....

మాదక ద్రవ్యాల వాడకాన్ని నివారించడంలో యువత ముందు బాగాన ఉండాలని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి . కాసిం పేర్కొన్నారు. ఈ దిశగా ఓయూ విద్యార్థులు మాదకద్రవ్యాల వాడకానికి వ్యతిరేకంగా బహుళ ప్రచారం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎన్. ఎస్. ఎస్ (జాతీయ సేవా పథకం) ఆధ్వర్యంలో “ మాదకద్రవ్యాల వాడకం- యువతపై దాని ప్రభావం- నివారణ మార్గాలు” అనే అంశంపై ఆర్ట్స్ కళాశాలలోని హాలు నెంబర్ 133 లో బుధవారం “షార్ట్ ఫిలిం “ పోటీలను నిర్వహించారు. ఏడు నిమిషాల వ్యవధితో విద్యార్థులు రూపొందించిన ఆరు షార్ట్ ఫిలిం లను ఈ పోటీల్లో ప్రదర్శించారు. పోటీల్లో పాల్గొన్న ఆరు టీములకు గాను ప్రథమ బహుమతి కి సైకాలజీ డిపార్ట్ మెంట్, ద్వితీయ బహుమతికి ఫిలాసఫీ డిపార్ట్ మెంట్, తృతీయ బహుమతికి జర్నలిజం డిపార్ట్ మెంట్ విద్యార్థులు ఎంపికయ్యారు. విజేతలకు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. కాసిం బహుమతులను అందజేశారు. అలాగే షార్ట్ ఫిలిం లను రూపొందించిన విద్యార్థులందరికీ సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ ప్రధానం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఓయూఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డ్రగ్స్, గంజా మొదలైన మాదకద్రవ్యాల వాడకానికి యువత దరిచేరనీయకుండా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తమ వంతు కృషి చేస్తున్నారని వివరించారు. కార్యక్రమ నిర్వాహకులు- ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ యాలాల శివానంద్ మాట్లాడుతూ ఓయూ క్యాంపస్ డ్రగ్స్ రహిత జోనుగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్యూరీ మెంబర్స్ ప్రొఫెసర్ క్రిష్టఫర్, డాక్టర్ వంశీధర్, డాక్టర్ పి. రమేష్ లతోపాటు అధ్యాపకులు ఉద్యోగులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఎర్రజెండా

**జనవరి 18న ఖమ్మం లో ముగింపు ఉత్సవాలు**

**లక్షలాది మందితో ఖమ్మం లో బహిరంగ సభ**

**సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి**




దేవరకొండ జనవరి 07 వార్త మిర్రర్ సామ్రాజ్యవాద వ్యతిరేక భూస్వామ్య పెట్టుబడుదారు వర్గాలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ది అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహ రెడ్డి అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100సంవత్సరాల అఖిల భారత స్థాయి ముగింపు ఉత్సవాల సందర్భంగా 2026 జనవరి 18న ఖమ్మం లో లక్షలాది మందితో జరిగే బహిరంగ సభ వాల్ పోస్టర్లను బుధవారం నాడు దేవరకొండ కామ్రేడ్ పల్లా పర్వత్ రెడ్డి భవన్ లో ఆవిష్కరించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ...భారత కమ్యూనిస్టు పార్టీ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించి దేశంలో 100 సంవత్సరాల ఉద్యమ పార్టీగా సిపిఐ ఖ్యాతి పొందింది. స్వాతంత్ర్యం కొరకు జరిగిన పోరాటంలో ఆనాడే అనేకమంది ఉరికంబాలు ఎక్కి ప్రాణ త్యాగాలు చేసిన వీరచరిత్ర గలది భారత కమ్యూనిస్టు పార్టీ. దేశ స్వాతంత్ర్యం కొరకు ఫ్యూడల్ సంస్థానాల విముక్తి కొరకు తాడిత, పీడిత జనావళి కొరకు వేలాదిమంది ప్రాణాలను కోల్పోయిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని భారతదేశ స్వాతంత్రం పొందిన తర్వాత దేశంలో రైతుల కొరకు వ్యవసాయ సంస్కరణలు, కార్మికుల కొరకు కార్మిక చట్టాలు, ప్రైవేటు రంగంలో ఉన్న బొగ్గు గనులు, బ్యాంకులు, బీమారంగం, ఆర్టీసీ లాంటి సంస్థలను జాతీయాకరణ కొరకు ఉద్యమాలు చేపట్టి సాధించటంలోనూ, స్టీలు, సిమెంటు, దేశరక్షణకు సంబంధించిన అనేక ప్రభుత్వరంగ పరిశ్రమలు ఏర్పాటు చేయటంలో సిపిఐ నిర్వహించిన పాత్ర మరువరానిది, భారతదేశ పార్లమెంటరీ చరిత్రలో ఆనాడు ప్రధాన ప్రతిపక్షంగా ఉంటూ దేశ, ఆర్థిక పారిశ్రామిక, వ్యవసాయ రంగాల అభివృద్ధికి ఆనాటి కమ్యూనిస్టు పార్టీ పార్లమెంట్ సభ్యులు భూపేష్ గుప్తా, హిరెన్ ముఖర్జీ, ఇంద్రజిత్ గుప్తా లాంటి కమ్యూనిస్టు మేధావులు విలువైన సూచనలు దేశాభివృద్ధికి అందించిన ఘన చరిత్ర సిపిఐది. మొదటిసారిగా 1952లో జరిగిన ప్రథమ పార్లమెంటు ఎన్నికల్లో నెహ్రూ గారి కంటి ఎక్కువ మెజార్టీ పొందిన గొప్ప వ్యక్తి రావినారాయణరెడ్డితో పాటు 1957, 1962లోను తెలంగాణ ప్రాంతం నుండి గెలిచిన కమ్యూనిస్టు పార్టీ నాయకులు పార్లమెంటులోనూ అసెంబ్లీలోనూ తెలంగాణ సమగ్ర అభివృద్ధి కోసం గళమెత్తిన సంగతి తెలుసు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి నీళ్లు నిధులు నియామకంలో జరుగుతున్న అన్యాయాలను ఎప్పటికప్పుడు పార్లమెంటులోనూ అసెంబ్లీలోను గళమెత్తిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ, ప్రజా సమస్యలపైన భూ సంస్కరణలు, ఇళ్ల స్థలాలు, పారిశ్రామికీకరణ, వ్యవసాయ అభివృద్ధి తదితర అంశాలపై ఉద్యమాలు చేపట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీది అని తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు మొట్టమొదటిగా అంగీకారం తెలియజేసి తెలంగాణ సాధనలో ప్రముఖ పాత్ర వహించిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ, నాగార్జునసాగర్, శ్రీరామ్సాగర్ లాంటి అనేక ఇరిగేషన్ ప్రాజెక్టుల కొరకు పోరాడింది. వెనుకబడిన ప్రాంతాలకు సాగు, త్రాగునీటి సౌకర్యం కల్పించాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని పరిశ్రమలను నెలకొల్పాలని ఉద్యమాలు చేపట్టింది సిపిఐ. వెనుకబడిన ప్రాంతాలకు కృష్ణా–గోదావరి జలాలను మళ్లించాలని ఉద్యమాలు చేపట్టి సాధించుకున్నప్పటికీ నేటికీ ప్రాజెక్టులు పూర్తికాక నత్త నడకలో నడుస్తున్నాయి అని స్వతంత్ర భారతదేశంలో అనేక పార్టీలు ఉద్భవిస్తూ తెరమరుగు కావడం మనం చూస్తున్నాం. కానీ ధనస్వామ్యం, కార్పొరేట్ సామ్యం, రాజ్యమేలుతున్న ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ తన బలానికి తగ్గ విధంగా శాసనసభ, పార్లమెంటులో ప్రాతినిధ్యం పొందలేకపోయినప్పటికీ ఈనాటికి లక్షల మంది పార్టీ సభ్యులు, కోట్ల మంది కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, విద్యార్థి, యువజనులు, మహిళలు, ఉపాధ్యాయులు, దళితులు, గిరిజనులు చిన్న సన్నకారు వ్యాపారస్తులకు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని,భారతదేశంలోని వామపక్ష లౌకిక ప్రజాస్వామ్య శక్తులను ఐక్యం చేసి కేంద్రంలో నరేంద్ర మోడీ బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలపై మతోన్మాద విధానాలపై ఐక్య ఉద్యమాలు చేపట్టవలసిన తక్షణ కర్తవ్యం ఉన్నది. భారతదేశంలో నేడు విశృంఖలంగా తలెత్తుతున్న మత, జాతి, కుల వైరుధ్యాల, కార్పొరేట్ సంస్థలు అంతులేని దోపిడీ నేపథ్యంలో సమగ్రత, సమైక్యత, సౌభ్రాతృత్వం, సమానత్వంతో కూడిన లౌకిక ప్రజాస్వామ్య భారత్ కొరకు నిలకడగా ఉద్యమిస్తూ ఉజ్వల చరిత్ర కలిగిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ 100 వసంతాల ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న ఖమ్మం లో బహిరంగ సభ ఉంటుందని ఈ భారీ బహిరంగ సభకు దేశ నలుమూలల నుండి 5 లక్షల కామ్రేడ్స్ పాల్గొంటున్నారని దేవరకొండ నియోజకవర్గం నుండి ప్రజలు అధిక సంఖ్యలో ఈ సభకు తరలిరావాలని అయన అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూశీ బుచ్చిరెడ్డి,మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి,పట్టణ కార్యదర్శి వలమల్ల ఆంజనేయులు,మండల కార్యవర్గ సభ్యులు పల్లా రంగారెడ్డి, మొగిల్లా వెంగలయ్య,కిన్నెర యాదయ్య,నాయకులు ఎండి మైనోద్దీన్, జూలూరి జ్యోతిబస్,వట్టేపు శివకుమార్,కాటం గోవర్ధన్, పెరుమాండ్ల లాలయ్య, నాంపల్లి రాజమల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# శివ స్వాములకు అన్న సంతర్పణ

**ఆదిమూలం శంకర్ గురు స్వామి**

**వీరమల్ల దాసు గౌడ్ గురు స్వామి**



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 07 చౌటుప్పల్ మండల కేంద్రంలోని వలిగొండ రోడ్ లోని ఉన్న నూతన శివాలయంలో శివ స్వాములకు అన్నదాన కార్యక్రమము నిర్వహించడం జరుగుతుంది. 3వ,రోజు అన్న సంతర్పణ కార్యక్రమము నిర్వహించిన జులు శంకరయ్య ధర్మ పత్ని పద్మ గార్ల కూతురు దివ్య శ్రీ పుట్టినరోజు సందర్భంగా శివ స్వాములకు అన్న సంతర్పణ కార్యక్రమము నిర్వహించడం వారి పూర్వ జన్మ సుకృతం అని వారి అదృష్టంగా భావించారు.వారి కుటుంబానికి ఆ పరమశివుని ఆశీస్సులు ఏళ్ల వేళల ఉండాలి అని ఆయు ఆరోగ్యాలు అష్ట ఐశ్వర్యాలు శివయ్య ప్రసాదించాలి అని మనసారా శివాదిక్ష మాలదారులు కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో అన్న సంతర్పణ నిర్వాహకులు వీరమల్ల దాసు గౌడ్ సన్నిధానం గురుస్వామి ఆదిమూలం శంకర్, గురుస్వాములు అంకం శ్రీను, నరసింహ చారి,తీగుళ్ల వెంకటేష్,దోటి రమేష్,దేశగోని వెంకన్న,డికొండ రాజు,దోర్నాల గజేందర్, ముప్పిడి కృష్ణ, పిట్టల సదానందం, నీళ్ల అశోక్, బద్ధం శ్రీకాంత్, ఆలయ ప్రధాన అర్చకులు సంతోష్ కుమార్ శాస్త్రి, శివ స్వాములు,తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు చేసింది సున్నా



బీఆర్ఎస్ మద్దతుతో గెలిచిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఓటమికి రంగం సిద్ధమైందనే విషయాన్ని గ్రామ పంచాయతీ ఎన్నికలు స్పష్టం చేశాయని చెప్పారు. పంచాయతీ ఎన్నికల్లో క్వార్టర్ ఫైనల్ ఫలితాలు వచ్చాయని, ఇక పురపాలక, ప్రాదేశిక ఎన్నికల్లో సెమీఫైనల్ ఫలితాలు వస్తాయని, ఆ తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఫైనల్ ఫలితాలు వస్తాయని చెప్పారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత, ఆగ్రహం కనిపిస్తున్నాయని స్పష్టంచేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ 7–8 స్థానాలు బీఆర్ఎస్ గెలుచుకుంటుందని, నేతలందరూ మరింత ఐక్యంగా కష్టపడితే పదికి పది స్థానాలూ గెలుస్తామని ధీమా వ్యక్తంచేశారు. షాపుల్లో యూరియా లేకుండా, యాప్ తెచ్చినా, కార్డు తెచ్చినా ప్రయోజనమేమిటని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా యూరియా కట్ట కూడా రైతులకు ఇప్పించలేకపోయారని అన్నారు. తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదంటూ పాలేరు నియోజకవర్గ రైతు ఒకరు స్వయంగా తనతో మాట్లాడిన విషయాన్నే చెప్తున్నానని కేటీఆర్ వివరించారు.

**గ్యారెంటీ కార్డు ఎక్కడ దాచుకోవాలి?**

'గ్యారెంటు కార్డును భద్రంగా భద్రపర్చుకోండి. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే కార్డులోని హామీలన్నింటినీ అమలు చేస్తాం' అంటూ నాడు డిప్యూటీ సీఎం భట్టి మాట ఇచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. మరి ఇప్పుడు రెండేండ్లయినా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఇప్పుడు ఆ కార్డును ఎక్కడ దాచుకోవాలని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ది సర్వభ్రష్ట ప్రభుత్వమని కేటీఆర్ మండిపడ్డారు.

**అభివృద్ధి, పెట్టుబడి కోసమే అప్పులు**

కేసీఆర్ ప్రభుత్వం అప్పు చేసిన మాట నిజమేనని, కానీ అది తెలంగాణ అభివృద్ధి కోసం, సంపద సృష్టికి, సంక్షమానికి ఉపయోగించా రని వివరించారు. కేసీఆర్ చేసిన అప్పు రూ.2.87 లక్షల కోట్లని కేంద్రం చెప్తుంటే.. రూ.6 లక్షల కోట్లంటూ భట్టి, రూ.7 లక్షల కోట్లంటూ తుమ్మల, రూ.8 లక్షల కోట్లంటూ బాంబులేటి, రూ.10 లక్షల కోట్లంటూ రేవంత్‌రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. మరి, కాంగ్రెస్ రెండేండ్ల పాలనలో అప్పుగా తెచ్చిన 2 లక్షల కోట్లు ఎకడికెళ్లాయని ప్రశ్నించారు.

**ఆంధ్రాలో చదివితే తప్పు.. అల్లుడైతే ఒప్పా?**

'1991లో గుంటూరులోని రావు రత్తయ్య కాలేజీలో ఇంటర్ చదువుకున్నాను. నేనైతే ఆంధ్రాలో చదువుకోవద్దు. ఆయన మాత్రం అదే ఆంధ్రాలోని భీమవరం నుంచి అల్లుడిని తెచ్చుకోవచ్చా' అంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన బాంబులేటి మంత్రి దీపావళికి బాంబులు వేస్తానని అన్నాడని, ఇప్పటికే రెండు దీపావళులు వెళ్లాయని గుర్తుచేశారు. ఆయన మాత్రం అదానీ, మోదీ కాళ్లు పట్టుకొని ఈడీ కేసులు లేకుండా బీజేపీలో చేరతానంటూ దండం పెడుతున్నారని విమర్శించారు. మరో మంత్రి కార్పొరేటర్ల ఇండ్ల చుట్టూ తిరుగుతున్నారని, తాను ఇకడికి వస్తుంటే ముగ్గురు బీఆర్ఎస్ కార్పొరేటర్లను తీసుకెళ్లి సీఎం రేవంత్ దగ్గర కూర్చోబెట్టారని మండిపడ్డారు. 'ప్రజలు అనుకుంటే మీరు ఎంతమందిని ఎత్తుకొని వెళ్లినా పీకేది ఏమీ లేద'ని స్పష్టంచేశారు. తాము కొత్తవారికి అవకాశం ఇస్తామని, కొత్త నాయకులకు తయారుచేస్తామని చెప్పారు. ఖమ్మంలో మున్నేరు కరకట్ట పనులు, కేబుల్ బ్రిడ్జి పనులు, రహదారులు, జంక్షన్ లభివృద్ధి, కొత్త బస్టాండు, మున్సిపల్ ఆఫీస్, ఐటీ హబ్ లాంటి అభివృద్ధి పనులను చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేని వివరించారు. ఇవన్నీ తన హయాంలో జరుగుతున్నట్టు తుమ్మల చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.

**ఈస్ట్‌మన్ కలర్‌లో సినిమా..**

కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ఈస్ట్‌మన్ కలర్‌లో సినిమా చూపించారని కేటీఆర్ విమర్శించారు. 'అది చేస్తాం.. ఇది చేస్తాం..' అంటూ హామీలు ఇచ్చి రెండేండ్లు అవుతున్నదని కానీ, ఖమ్మంకు ఇంతవరకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడున్నర లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వాలనే ఉద్దేశంతో సీతారామ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ అద్భుతంగా డిజైన్ చేశారని గుర్తుచేశారు. 90% పనులు కేసీఆర్ పూర్తి చేశారని, 2023 డిసెంబర్ రెండో తేదీన మనం దిగిపోయే నాటికి కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యి మాదిరిగా వారి చేతికి తాళాలు ఇచ్చి తప్పుకొన్నామని తెలిపారు. అయినా ఈ రెండేండ్లలో వారేం చేశారని ప్రశ్నించారు. ఒక్క పనీ ముందుకు జరగకపోగా ముగ్గురు మంత్రులు కమీషన్ల యావలో పడ్డారని దుయ్యబట్టారు.



## అడవులు అగ్ని భారీన పడకుండా పరిరక్షంచాలి

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 7జగిత్యాల జిల్లా రాయికల్ మండలం జగన్నాథ్ పూర్ గ్రామంలో అటవీ శాఖ అధికారులు అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగింది. అడవులు అగ్ని భారీన పడకుండా పరిరక్షంచాలి, పర్యావరణ రక్షణలో భాగస్వాములు కావాలి అని పిలునిచ్చారు. అడవిలో అగ్ని ప్రమాదం జరిగితే టోల్ ఫ్రీ నం. 8004255364కు కాల్ చేసి అగ్ని ప్రమాదం నుండి కాపాడండి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్. పరాచ శంకర్, డిప్యూటీ రేంజర్ పద్మ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఇలియాజ్, గ్రామ పంచాయితీ సెక్రటరీ గుర్రాల మౌనిక, వ్యవసాయ అధికారి నరేష్, బేస్ క్యాంపు శివ, రాజం, కారోబార్ రమ్య, మాజీ సర్పంచ్ ఆత్రం భగవంత్ రావు, గ్రామ పటేల్ సుధాకర్, గ్రామ యువత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## మాల్ పట్టణ కేంద్రంలో స్వామి వివేకానంద విగ్రహ ప్రతిష్టాపన

మాల్ వార్త మిర్రర్ ప్రతినిధిమాల్ పట్టణ కేంద్రంలో జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద జయంతి జనవరి 12న విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మాల్ పట్టణ ప్రజల దాతల సహకారంతో స్వామి వివేకానంద విగ్రహ ప్రతిష్టాపన జరుగుతుందని, ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు, యువజన సంఘాల నాయకులు, విద్యార్థులు, హిందూ బంధువులు, స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని కోరారు. చింతపల్లి బిజెపి నాయకులు సందుపట్ల లక్ష్మణ్ సాగర్, రాజేష్ సాగర్, బాలరాజ్, స్వామి తెలిపారు



## సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కొరెల్లి నాగరాజుగౌడ్... ఎర్ర నాగు

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జనవరి 7 (సాక్ష్యం) ..

మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ను బుధవారం సీతాఫల్మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు కూరెల్లి నాగరాజు గౌడ్, ఎర్ర నాజుతో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేకు శాలువ కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

## యువత చెడు వ్యసనాలకు దూరమై..క్రీడల్లో రాణించాలి:ఎస్సై జగన్




సంస్థాన్ నారాయణపూర్ జనవరి 07( వార్త మిర్రర్) యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఎస్.ఎన్.పి.ఎల్ సీజన్–5 మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పల నాగరాజు అలాగే సీజన్ 5 అధ్యక్షులు కొండ నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలకు స్థానిక ఎస్సై జగన్, సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి విచ్చేసి బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలపై ఆసక్తి చూపాలని, ఆటలు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి టోర్నమెంట్లు చక్కని వేదికలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, క్రీడాకారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ కేసు.. హైకోర్టును ఆశ్రయించిన రకుల్‌ప్రీత్‌సింగ్ సోదరుడు

మాసాబ్ ట్యాంక్ పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని ప్రముఖ సినీ నటి రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్ ప్రీత్ సింగ్ హైకోర్టును ఆశ్రయించాడు. డ్రగ్స్ కేసులో అతడిపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. విక్రేతల నుంచి డ్రగ్స్‌ను కొనుగోలు చేసినట్లు కేసు నమోదైంది. నాటి నుంచి అమన్ పరారీలో ఉన్నాడు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు చేపట్టకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఈ పిటిషన్‌పై నిన్న హైకోర్టులో విచారణ జరిగింది. దీనిపై తదుపరి విచారణను హైకోర్టు ఈ నెల 9వ తేదీకి వాయిదా వేసింది. గత ఏడాది డిసెంబర్ 19న హైదరాబాద్‌లోని మాసాబ్ ట్యాంక్ పరిధిలో పోలీసులు జరిపిన డ్రగ్స్ దాడుల్లో కొకైన్, ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పట్టుబడిన నిందితులను విచారించగా అమన్ ప్రీత్ సింగ్ పేరు వెలుగుచూసింది. నెల రోజుల వ్యవధిలో అమన్ ఆరుసార్లు డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

# డ్రగ్స్, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలి

### జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్





వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 7

డ్రగ్స్, మాదకద్రవ్యాల మహమ్మారిని సమాజం నుండి పూర్తిగా నిర్మూలించి భావితరాలకు ఆరోగ్యకరమైన, సురక్షతమైన భవిష్యత్తును అందించాలనే లక్ష్యంతో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్ తెలిపారు. బుధవారం రోజున జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రంలో గల ఆర్ఆర్ గార్డెన్స్ లో జిల్లా పోలీస్ శాఖ మరియు రాయికల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, డ్రగ్స్, మాదకద్రవ్యాలకు బానిసలవడం వల్ల యువత భవిష్యత్తు పూర్తిగా నాశనం అవుతుందని హెచ్చరించారు. విద్యార్థులు తమ లక్ష్యాలపై దృష్టి సారించి, మంచి చదువుతో పాటు క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలతో పాటు కుటుంబాలు విచ్ఛిన్నం కావడం, నేరాలకు పాల్పడే పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. డ్రగ్స్ సరఫరా, వినియోగంపై జిల్లా పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, రాబోయే రోజుల్లో మాదకద్రవ్యాల నిర్మూలనలో కీలక పాత్ర పోషించేది నేటి తరం విద్యార్థులేనని పేర్కొన్నారు. విద్యార్థుల దృష్టి పూర్తిగా తమ విద్య, కెరీర్‌పై ఉండాలని, నిషేధిత డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాల వైపు ఆకర్షితులు కాకూడదని సూచించారు. అధిక ఒత్తిడిని ఎదుర్కొనేందుకు మత్తు పదార్థాలను ఆశ్రయించకుండా, సానుకూల మార్గాలను ఎంచుకోవాలని తెలిపారు. స్నేహితుల ఒత్తిడితో చెడు మార్గాల వైపు అడుగులు వేయరాదని హెచ్చరించారు. మాదకద్రవ్యాల బారిన పడుతున్న యువతను కాపాడేందుకు జిల్లా పోలీస్ శాఖ కృషి చేస్తోందని, అందులో భాగంగా విద్యాసంస్థలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహించడం జరుగుతోందని అన్నారు. మత్తు పదార్థాల నివారణ కోసం యువత, విద్యార్థులు యాంటీ డ్రగ్స్ కమిటీలలో సభ్యులుగా చేరి "యాంటీ డ్రగ్స్ సోల్జరు లుగా సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుసుకున్న విషయాలను స్నేహితులు, బంధువులకు తెలియజేసి డ్రగ్స్ నివారణలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. అదేవిధంగా ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వారు ఎలాంటి చెడు అలవాట్లకు బానిసలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఎవరైనా డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం గమనించిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచడం జరుగుతుందని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. డ్రగ్స్ లేని సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థులే సమాజానికి మార్గదర్శకులని పేర్కొన్నారు. అనంతరం మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగి అవగాహన పెంపొందించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మేము డ్రగ్స్ తీసుకోము. మా బంధుమిత్రులు, స్నేహితులు, చుట్టు పక్కల వారు మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా చూసుకునే బాధ్యత మాదే. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాల గురించి వారికి అవగాహన కల్పిస్తాము"అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీ శేషాద్రిని రెడ్డి ఐపీఎస్, డీఎస్పీ రఘు చందర్, రూరల్ ఇన్స్పెక్టర్ సుధాకర్, ఎస్ఐలు సుధీర్ రావు, గీత, కృష్ణ, ఎంఈఓ, తహసీల్దార్, జేఏసీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వాసరి రవి, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, కోశాధికారి మచ్చ శేఖర్, వార్త మిర్రర్ రిపోర్టర్ తిరుమల శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ-విద్యార్థులు పాల్గొన్నారు.

# కోదాడ-జడ్చర్ల ఎన్ హెచ్ ఉ167 రోడ్డు విస్తరణ పనులకు యజమానదారులు సహకరించాలి

మిర్యాలగూడ జనవరి 7:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ పట్టణం గుండా

వెళ్తున్న కోదాడ-జడ్చర్ల ఎన్ హెచ్ ఉ167 రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యే దశకు చేరుకున్నాయని మిర్యాలగూడ పట్టణంలో విస్తరణ కు అడ్డుగా భవనాలను వెంటనే కూల్చాలని యజమానులను మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం. నారాయణ్ అమిత్ కోరారు. బుధవారం కార్యాలయం నుండి జారీ చేసిన ప్రకటనలో మిర్యాలగూడ పట్టణంలో ఒక కిలోమీటర్ వరకు రోడ్డు విస్తరణ పనులు జరగనున్నాయన్నారు. గణేష్ మార్కెట్ నుండి రాజీవ్ చౌక్ వరకు 90 అడుగులు, రాజీవ్ చౌక్ నుండి సుధా బ్యాంక్ వరకు 84 అడుగుల వెడల్పుతో ఫోర్ లేన్ బీటీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, ఫుట్‌పాత్‌లు, డ్రైనేజ్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. హై వే ప్రాజెక్టుకు సంబంధించి రూ. 54 కోట్ల భూసేకరణలో భాగంగా రూ. 44 కోట్లు 205 మంది భవనాలు, దుకాణాలు పోయిన వారికీ ఇప్పటికే నష్టపరిహారం చెల్లించామన్నారు. మిగిలిన 55 మంది లబ్ధిదారులుసబ్-కలెక్టర్ కార్యాలయంలోతమడాక్యుమెంట్లుసమర్పించిపరిహారం పొందవలసిందిగా కోరారు. సబ్-కలెక్టర్ కార్యాలయం నుండి రెండవ 3ఇ నోటీసు జారీ చేశామని, ఇచ్చిన 60 రోజుల గడువు కూడా ముగిసిందన్నారు. షాపులు, ఇళ్ల యజమానులు అందరూ స్వచ్ఛందంగా ఖాళీ చేసి కూల్చేందుకు సహకరించాలని కోరారు. రోడ్డు విస్తరణలో అడ్డమున్న భవనం కూల్చే సమయంలో రోడ్డుకు అవసరమైన స్థలాన్ని వదిలి సెట్ బ్యాక్ పాటిస్తూ వెనక్కి




కట్టుకోవాలన్నారు. మున్సిపల్ అనుమతి కూడా సెట్ బ్యాక్ ఉన్నప్పుడే ఇవ్వబడుతుందన్నారు. అందరూ ఎన్హెచ్ ఉ167 రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలని కోరారు

# నేరేడు గొమ్ము మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులుగా పులికంటి సుధాకర్





నేరేడు గొమ్ము జనవరి 07 వార్త మిర్రర్ :నేరేడు గోమ్ము మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా నేరేడు గోమ్ము సర్పంచ్ పులికంటి సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులుగా కేతావత్ బాబు రామ్ నాయక్ ప్రధాన కార్యదర్శిగా బాణావత్ మంజునాథ్ లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పులికంటి సుధాకర్ మాట్లాడుతూ నా ఎన్నికలు సహకరించిన సర్పంచులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్రంలోనే నేరేడు గోమ్ము మండలంలోని గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని సర్పంచులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సర్పంచులకు అన్ని విధాల సహకరిస్తూ వారి సమస్యలపై ఎప్పటికప్పుడు సమన్వయంగా ఉంటానని వారన్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులపై గ్రామాలలో మరిన్ని బరుబాయితులు పెరిగాయని తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ ఆశీర్వాదంతో గ్రామాల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు లోకసాని కృష్ణయ్య, మాజీ ఎంపిటిసి గిరి యాదయ్య వారితోపాటు ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు ఉన్నారు.

# అంబేద్కర్ విగ్రహం చుట్టూ ప్రహరీ గోడను వెంటనే పునర్నిర్మించాలి

### జాతీయ రహదారుల సంస్థడివిజనల్ ఇంజనీర్‌కు నాయకుల వినతి:

కొండ మల్లేపల్లి జనవరి 07 వార్త మిర్రర్ నల్గొండ జిల్లా కొండ మల్లేపల్లి మండల కేంద్రంలోని అత్యంత కీలకమైన ఎక్స్ రోడ్డు కూడలిలో నెలకొల్పిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి విగ్రహం రక్షణ గోడను తక్షణమే అదే ప్లేస్ లో పునర్నిర్మించాలని దేవరకొండ నియోజకవర్గ వివిధ దళిత, ప్రజా, సామాజిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రోజున దేవరకొండ నియోజకవర్గంలోని వివిధ కుల, ప్రజా మరియు సామాజిక సంఘాల నాయకుల బృందం, జాతీయ రహదారుల సంస్థ డివిజనల్ ఇంజనీర్ (డీఈ)కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత నెలలో కొండ మల్లేపల్లి జంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహం చుట్టూ జాతీయ రహదారుల సంస్థ అధికారిక మార్కింగ్ ప్రకారంగా ఉన్న ప్రహరీ గోడను తొలగించారని గుర్తు చేశారు. అయితే, గోడను తొలగించి చాలా కాలం గడుస్తున్నా, అధికారులు తిరిగి నిర్మాణ పనులు ప్రారంభించకపోవడం వల్ల విగ్రహం భద్రత లేని స్థితిలో ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. నేషనల్ హైవే అథరిటీ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం, గతంలో ఏ స్థలంలో అయితే రక్షణప్రహరీ గోడ ఉండేదో, అదే విధంగా పటిష్టమైన ప్రహరీ గోడను అదే స్థానంలో పునర్నిర్మించాలని వారు స్పష్టం చేశారు. కేవలం గోడ నిర్మించడమే కాకుండా, విగ్రహం చుట్టూ ఉన్న పరిసరాలను సుందరీకరించాలని అధికారులను కోరారు. విగ్రహం



చుట్టూ సుందరీకరణను ఏర్పాటు చేసి ఆ ప్రాంతాన్ని గౌరవప్రదంగా తీర్చిదిద్దాలని విన్నవించారు. లక్షలాది మందికి ఆదర్శప్రాయుడైన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గారి విగ్రహం వద్ద రక్షణ చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు. అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని, లేనిపక్షంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సామాజిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నాయకులు , ప్రజా సంఘాల నాయకులు, మాల మహానాడు నాయకులు సామాజిక సంఘాల నాయకులు, కార్యకర్తలు మరియు అంబేద్కర్ అనుచరులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేసిన సర్పంచులు ఫోరమ్ అధ్యక్షలు రాంసింగ్ నాయక్

దేవరకొండ జనవరి 07 వార్త మిర్రర్ :దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామం బ్రిడ్జితాండలో ఎమ్మెల్యే బాలునాయక్ సహకారంతో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లకు ఎమ్మెల్యే బాలునాయక్ సూచన మేరకు స్థానిక సర్పంచ్, మండల సర్పంచులు ఫోరమ్ అధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్ స్థానిక నాయకులు. వార్డు సభ్యులతో కలిసి భూమి పూజ చేశారు ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు స్నేహ వినోద్. ముడవత్ దాసు. నాగరాజు. కిషన్. సంతోష వెంకట్. సునీత బద్దు. లక్ష్మ ప్రశాంత్. కాంగ్రెస్ నేత వడిత్య సేవ్య నాయక్. పంచాయతీ కార్యదర్శి అంబెద్కర్ తదితరులు ఉన్నారు.



# పెరుగుతున్న ఉపాధి ఉ తగ్గని వేతన అసమానత

# తెలంగాణ మహిళా కార్మికుల వాస్తవ స్వరం

### రచన: వైశాలి తివారి



సికింద్రాబాద్, వార్త మిర్రర్, జనవరి 7:తెలంగాణలో మహిళల ఉపాధి పాల్గొనింపు గణాంకాల పరంగా వేగంగా పెరుగుతున్నప్పటికీ, వేతనాల విషయంలో మాత్రం అసమానతలు యథవిధిగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా అసంఘటిత రంగంలో మహిళలు సమానమైన పని చేసినా పురుషుల కంటే గణనీయంగా తక్కువ వేతనం పొందుతూ నిశ్శబ్ద పోరాటం చేస్తున్నారు. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (గూఖీూ) 2023ఉ24 ప్రకారం పట్టణ ప్రాంతాల్లో మహిళల కార్మిక పాల్గొనింపు రేటు 50ఉ51 శాతానికి చేరగా, గ్రామీణ ప్రాంతాల్లో ఇది 25ఉ26 శాతంగా నమోదైంది. మహిళల పని పాల్గొనింపు రేటు 2017లో 22 శాతం ఉండగా, 2024 నాటికి 40.3 శాతానికి పెరగడం గమనార్హం. అయితే ఈ సంఖ్యాత్మక వృద్ధికి తగిన ఆర్థిక న్యాయం మాత్రం అందడం లేదు. హైదరాబాద్‌లో మహిళలు సగటున పురుషుల కంటే 30 నుంచి 40 శాతం తక్కువ వేతనం పొందుతున్నట్లు వివిధ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. రిటైల్, తయారీ, ఐటీ రంగాల్లో వేతన వ్యత్యాసం 10 నుంచి 17 శాతం మధ్య కొనసాగుతోంది. వ్యవసాయం, అసంఘటిత రంగాల్లో ఈ అసమానత మరింత తీవ్రంగా కనిపిస్తోంది. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న మహిళా కార్మికులు నెలకు కేవలం ?5,000 వరకు మాత్రమే సంపాదిస్తూ, ప్రభుత్వ నిర్దేశించిన కనీస వేతనానికి చాలా దూరంగా ఉన్నారు. నాచారం చిలకనగర్‌కు చెందిన గార్మెంట్ కార్మికురాలు సవితా దేవి తన ఆవేదనను ఇలా వ్యక్తం చేశారు:"మేము పురుషులు చేసే పనినే చేస్తాం. అయినా వారికి ?14,000 ఇస్తారు, మాకు మాత్రం ?9,500 మాత్రమే. ఫ్యాక్టరీ పని తర్వాత ఇంటి బాధ్యతలు కూడా మావే," అని తెలిపారు. కనీస వేతనాల అమలు, వేతన వ్యత్యాసాలపై కార్మిక శాఖ నుంచి స్పష్టమైన స్పందన లేకపోవడం పర్యవేక్షణ లోపాలను వెలుగులోకి తీసుకొస్తోంది. మహిళల ఉపాధి వృద్ధి కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా, సమాన వేతనంతో కూడిన నిజమైన సాధికారతగా మారాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఉపాధి అవకాశాల పెరుగుదల ఒక ముందడుగు అయితే, సమాన వేతనం సాధించడమే నిజమైన సామాజిక న్యాయం అని వారు స్పష్టం చేస్తున్నారు.

## ఏఐపీసీ డిప్యూటీ స్టేట్ హెడ్ గా.. క్వీని విక్టోరియా నియామకం..



సికింద్రాబాద్, వార్త మిర్రర్ జనవరి 7...

అఖిల భారత ప్రొఫెషనల్ కాంగ్రెస్ కమిటీ లో అంతర్జాతీయ ఓపెన్ వాటర్ స్విమ్మర్ డాక్టర్ గంధం క్వీని విక్టోరియా నూతనంగా నియమితు లయ్యారు. రంగారెడ్డి జిల్లా ఆమన్ గల్లు పట్టణానికి చెందిన ఆమె ప్రస్తు తం బర్కత్ పురలో నివాసం ఉంటు న్నారు. ఏఐపీసీలో మధ్యప్రదేశ్, తె లంగాణ, కర్ణాటక, రాజస్థాన్ నుంచి కొత్తగా నలుగురికి అవకాశం కల్పిం చారు. తెలంగాణ నుంచి క్వీని విక్టో రియాకు డిప్యూటీ స్టేట్ హెడ్ గా అవకాశం వచ్చింది. ఏఐపీసీ స్పో ర్ట్స్ జాతీయ అధ్యక్షుడు స్మిత్ సింగ్ నుంచి బుధవారం ఆమెకు ఈ మేరకు ఉత్తర్వులు అందాయి. రాష్ట్ర ఉప ఇన్ చార్జి గాని యమితులైన క్వీని విక్టోరియాకు రాష్ట్ర నీటి పారుద ల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, తెలంగాణ ఏఐపీసీ అధ్యక్షుడు ఆదిత్యరెడ్డిని మర్యాద పూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా క్వీని వి క్టోరియాను వారు ఘనంగా సత్కరించి అభినం దించారు. నాపై నమ్మకంతో తెలంగాణ రాష్ట్రం నుంచి ఏఐపీసీ డిప్యూటీ హెడ్ గా నియ మించినం దుకు కమిటీ ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# ఎఈ ని కలిసి నూతన సంవత్సర

# శుభాకాంక్షలు తెలిపిన యాదవ సంఘ నేతలు

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 07

మండల కేంద్రంలోని విద్యుత్ ఎఈ సతీష్ యాదవ్ ను మండల యాదవ సంఘ నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి సన్మానం చేశారు. కార్యక్రమంలో జాతీయ యాదవ సంఘ ఉపాధ్యక్షుడు చిలకల శ్రీనివాస్ యాదవ్, యాదవ సంఘ మండల అధ్యక్షుడు చినుకని మల్లేశం యాదవ్, డాక్టర్ చినుకని శివప్రసాద్, నల్ల పర్వతాలు యాదవ్, ప్రధాన కార్యదర్శి గంగనబోయిన వెంకటేష్ యాదవ్, ఉపాధ్యక్షులు ఎర్రసాని సతీష్ యాదవ్, గజ్జి పాండు యాదవ్, గుండెబోయిన వేణు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళలకు అనువైన చీరలు అందించిన ఘనత కాంగ్రెస్ సొంతం

## - ధర్మోజి గూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 07

మహిళల హుందాతనాన్ని పెంచే విధంగా ఖరీదైన చీరలు పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం సొంతమని ధర్మోజి గూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలకు అందించిన చీరలను చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం గ్రామంలో బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జువ్వి నర్సింహ్మా మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే సొంతమన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందించి వారి చిరకాల ఆకాంక్ష నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే సొంతమన్నారు. దశాబ్ద కాలంగా రేషన్ కార్డుకు నోచుకోని కుటుంబాలకు రేషన్ కార్డులను అందించడం, 200యూనిట్ల ఉచిత విద్యుత్తు అందించడం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సిలిండర్ కు సబ్సిడీ అందించి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుకోవడం కాంగ్రెస్ పార్టీకే చెల్లిందన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పక్కీరు శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి శ్రీనివాస్, ఐతరాజు శారద లింగస్వామి, రాచకొండ భార్గవ్, జీడిముడ్ల శోభ కొండల్, జంగం వెంకటమ్మ అంజయ్య, మాజీ సర్పంచ్ మాజీ సర్పంచ్ బద్రి లింగయ్య, మాజీ ఉప సర్పంచ్ లు బత్తుల శ్రీహరి, కొంతం బుచ్చిరెడ్డి, కొంతం శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మ, వివోఏ సంతోష, అంగన్ వాడి పూదరి పారిజాత, ఎంగలి మౌనిక తదితరులు పాల్గొన్నారు..